ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
విజయనగరం



27న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదినం సందర్భంగా ఈ నెల 27న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు తెలిపారు. ఆదివారం నగరంలోని కోలగట్ల నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా రక్త కొరతను అధిగమించేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరభద్రస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. 28న ఆలయాల్లో పూజలు, అన్నదానం, ఆసుపత్రి, ప్రేమ సమాజం వద్ద రొట్టెల పంపిణీ తదితర వాటితోపాటు.. ప్రజల ఆకలిని తీర్చేందుకు ఆరో ఫుడ్ కోర్టును నగరంలోని కొత్తపేట వద్ద ప్రారంభించనున్నామని చెప్పారు. అభిమానులు, కార్యకర్తలెవరూ ఫ్లెక్సీలు, హోర్డింగులు కట్టవద్దని, పూర్తిగా సేవా కార్యక్రమాలే చేపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, ముద్దాడ మధు, కంటుభుక్త తవిటిరాజు, అల్లు చాణక్య, బాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోల్‌మాల్

- హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పక్కదారి
- రూ.కోట్లలో కాజేసేందుకు రంగం సిద్ధం
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఎపి రైతు సంఘం

గతేడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల విషయంలో రూ.కోట్లు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు సమయంలో రవాణాకు సంబంధించి ఖర్చులు, హమాలీ ఛార్జీలు నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం విదితమే. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు రూ.కోట్లలో దారిమళ్లించేందుకు రంగం సిద్ధమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎపి రైతు సంఘం ఆందోళనకు సిద్ధమవుతోంది.



సొంత ఖర్చుతో మిల్లుకు ట్రాక్టర్‌పై ధాన్యం తరలిస్తున్న రైతు (ఫైల్)

గంట్యాడ మండలం బుడతనాపల్లికి చెందిన ప్రగతి ఎఫ్‌పిఒకు చెందిన వాహనం (ఎపి 39 సికె 4718) రైతు భరోసా కేంద్రంలో రిజిష్టర్ అయింది. సుమారుగా 20 మంది రైతులకు సంబంధించి, 300 క్వింటాళ్ల ధాన్యం రవాణా చేసింది. కానీ ఈ వాహనానికి ట్రాన్స్‌పోర్టు డబ్బులు నేటికీ విడుదల కాలేదు.

ప్రజాశక్తి - జామి

జిల్లాలో గత ఖరీఫ్ ధాన్యాన్ని ఆర్‌బికె, పిఎసిఎస్‌ల ద్వారా కొనుగోలు చేశారు. ఈ రెండు చోట్ల కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టి నమోదుచేశారు. ట్రాన్స్‌పోర్ట్ పెట్టుకోవాలని రైతులకు చెప్పి, ఛార్జీలు వాహనదారుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆర్‌బికెల ద్వారా ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్ కూడా చేశారు. తీరా ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిన సమయానికి నామమాత్రంగా రైతులకు జమ చేసి, మెజారిటీ డబ్బును పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 3.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.697.71 కోట్లు సుమారుగా 92,474 మంది రైతులకు చెల్లించారు. అయితే హమాలీ ఛార్జీల కింద రూ.5.58 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు కింద రూ.5.80 కోట్లు విడుదల చేశారు. వాస్తవానికి ఈ డబ్బంతా ట్రాన్స్‌పోర్ట్, హమాలీ ఛార్జీలు భరించిన రైతుల ఖాతాలకు జమ చేయాలి. కానీ మెజారిటీ డబ్బుల విషయంలో గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఎపి రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఖర్చంతా రైతులదే

ధాన్యం రైతులు సొంత డబ్బులు పెట్టి రవాణా, తూకం లోడింగ్ తదితర పనులు చేసి మిల్లుకు పంపిన విషయం తెలిసిందే. రవాణాకు క్వింటాకు రూ.25, కళాసీ కూలి నిమిత్తం రూ.26.. మొత్తం రూ.50 వరకు రైతుకి కాని, ఆర్‌బికెలో రిజిష్టరై, ధాన్యం రవాణా చేసిన వాహనదారుడికి కాని చెల్లించాలి. తూకం, లోడింగ్ ఛార్జీలు ఇప్పటికే పిఎసిఎస్‌కి ప్రభుత్వం ఇచ్చేసింది. కాని రైతులకు మాత్రం ఇచ్చింది నామమాత్రమే. రవాణా, కళాసీ ఛార్జీతో రూ.50 నేరుగా కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లుకు పంపిన రైతులకు రావాలి. రైతులకు రావాల్సిన డబ్బులు కొందరు బినామీ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల పేర నమోదు చేసి కాజేయాలని చూస్తున్నారు. జిల్లాలో మెజారిటీ రైతులకు కొనుగోలు ఛార్జీలు అందకపోవడమే అందుకు నిదర్శనం.

కొనుగోలు ఛార్జీలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లుకు తమ ఖర్చుతో పంపిన రైతులకు ఇవ్వాల్సిన రూ.కోట్లలో ఛార్జీలు పక్కదారి పడుతున్నాయి. కొనుగోలు సమయంలో మిల్లర్ల బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తాజాగా రైతులు మరో మోసానికి బలవుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– బి.రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కళాసీ ఛార్జీలు రైతులకే

ధాన్యం కొనుగోలుకు సంబంధించి కళాసీ ఛార్జీలు రైతులకే చెల్లించాలి. ఇప్పటికే దాదాపుగా రూ.5 కోట్లకు పైగా చెల్లించాం. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు కూడా రైతు రిజిష్టర్ చేసిన వాహనాలకు చెల్లిస్తున్నాం.

– మీనాకుమారి, సివిల్ సప్లై డిఎం

హోరాహోరీ

బాలుర విభాగంలో విజేతగా విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 66వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం నిర్వహించిన కబడ్డీ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో కృష్ణ జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో విజయనగరం జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్‌పి మాట్లాడుతూ వచ్చే నెల ఆరో తేదీ నుంచి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రాన్ని విజేతగా నిలపాలన్నారు. కార్యక్రమంలో డివిఇఒ సురేష్‌బాబు, టోర్నమెంట్ పరిశీలకులు జయరాజ్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, బి.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు, తౌడుబాబు, కెఎ బాలకృష్ణ, ఎపి పోలీస్ టీమ్ కోచ్ పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన విజయనగరం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్‌పి బెల్లాన

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

స్థానిక కస్పా హైస్కూల్ మైదానంలో అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ప్రారంబించారు. ముందుగా భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ క్రీడలకు విజయనగరం ప్రసిద్ధి అన్నారు. అనంతరం విజయనగరం, చిత్తూరు జట్లు, ప్రకాశం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పట్టాభిరాం, అనంతరం ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, బొమ్మన రామారావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.మల్లేశ్వరరావు, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బాలకృష్ణ, గోపాల్, మల్లికార్జున్, హరీష్, బి.శ్రీను పాల్గొన్నారు.





ఖోఖో ఆడుతున్న తూర్పుగోదావరి, ప్రకాశం జట్లు ;ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

కలెక్టర్ నాగలక్ష్మి ● చింతపల్లిలో బీచ్ పరిశుభ్రత కార్యక్రమం



తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రతిఒక్కరూ తమ బాధ్యత నిర్వర్తించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ లైఫ్‌లో భాగంగా బీచ్‌ల పరిశుభ్రత కోసం చేపట్టిన స్వచ్ఛతా జన్‌భాగిదారీ - సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పూసపాటిరేగ మండలం చింతపల్లి సముద్రతీరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో చింతపల్లి గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులతో కలిసి కలెక్టర్ స్వయంగా ప్లాస్టిక్ వ్యర్థాలను బీచ్ నుంచి తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చింతపల్లిలో ఫిషింగ్ జెట్టీ నిర్మిస్తున్నందున ఆ ప్రాంతంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టామన్నారు. ఇక్కడ తీరాన్ని పరిశుభ్రంగా రూపొందిస్తే పర్యాటకంగా కూడా మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. తీరంలో వాక్‌థాన్ నిర్వహించి కొంతదూరం నడిచారు. పర్యావరణ పరిరక్షణపై సంతకాల సేకరణ చేపట్టారు. విజయనగరానికి చెందిన ఎంపి పాలిమర్స్, మహేష్ ప్రొడక్ట్స్ సంస్థలు పర్యావరణ అనుకూలమైన పదార్థాలతో తయారు చేసిన ప్లేట్లు, గ్లాసులు, క్యారీ బ్యాగులు, స్ట్రాలు పరిశీలించారు.

కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం, మత్స్యశాఖ జిల్లా అధికారి నిర్మలాకుమారి, తహశీల్దార్ ఐ.భాస్కరరావు, ఎంపిడిఒ జి.రామారావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, సర్పంచ్ బి.మసలి, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఎంపిటిసి మైలపల్లి తాత, మెరైన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి తూట్లు.. కూలీలకు పాట్లు

- సమస్యలు పరిష్కరించాలంటూ నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా
- తరలిరానున్న ఉపాధి కూలీలు

కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పడుతున్నాయి. కూలీలకు పాట్లు తప్పడం లేదు. అలవెన్సుల తగ్గింపు, నీడ, నీరు లేకుండా చేయడం ద్వారా ఉపాధి కూలీలను దూరం చేసి, దాన్ని బూచిగా చూపి చివరికి చట్టాన్నే నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దీన్ని ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్న ఉపాధి కూలీలు ప్రతిఘటించేందుకు సన్నద్ధమయ్యారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నాకు దిగుతున్నారు.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2004లో కేంద్రంలోని యుపిఎ-1 ప్రభుత్వం కమ్యూనిస్టుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన విషయం విదితమే. అప్పట్లో వామపక్షాలతో కుదిరిన ఒప్పందం మేరకు 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా ఏటా 100 రోజుల పని గ్యారెంటీ కావడంతోపాటు పని ప్రదేశంలో నీరు, నీడ వంటి సదుపాయాలు కల్పించబడ్డాయి. నీరు, నీడ సదుపాయం కల్పించేందుకు ఒక్కో గ్రూపునకు రూ.10 చొప్పున చెల్లించేవారు. వేసవి అలెవెన్సు కింద కూలీకి అందిన వేతనంపై ఫిబ్రవరి నుంచి మే వరకు 20 శాతం నుంచి 30 శాతం వరకు ఇచ్చేవారు, పార, గునపాం వంటి పనిముట్లకు కూడా రోజుకు రూ.5 చొప్పున చెల్లించేవారు. పని కోరిన రెండు వారాల్లో కల్పించకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాలన్నది చట్టంలో మరో అంశం. ఇందుకోసం జాబ్‌కార్డులు సైతం ప్రభుత్వం జారీచేసింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 3.40 లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో 90 శాతం మంది ఉపాధి పనులు ఉపయోగించుకుంటున్నారు. ఉపయోగించుకుంటున్న వారిలో అత్యధికులు ఏడాది 100 రోజుల పనిదినాలు పూర్తిచేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. 2006 నుంచి ఇప్పటి వరకు 6.16 కోట్ల పనిదినాలను అధికారులు కల్పించారు. ఏటా రూ.వందల కోట్లు ఉపాధి కూలీలకు అందుతున్నాయి. ఇలా ఉపాధి కూలీలకు అందుతున్న వేతనాలపై 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ పేరిట నిధులు అదనంగా వస్తున్నాయి. వీటితో ప్రభుత్వ ప్రాధాన్యతలుగా పేర్కొన్న సచివాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు వంటి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఉపాధి హామీ చట్టం అమల్లో మన జిల్లా రాష్ట్రంలోనే కాదు, దేశంలోనూ మొదటి స్థానమే. ఇందుకుగాను మన జిల్లా కలెక్టర్లు, ఉపాధి హామీ పర్యవేక్షకులు ఎన్నో సార్లు అవార్డులు, రివార్డులు అందుకున్నారు. మరోవైపు ఏటా పెరుగుతున్న ధరల వల్ల కూలీల ఆర్థిక ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఎండ, వానల నుంచి తట్టుకోలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో తమకు ఏడాదిలో 200 రోజులు పని గ్యారెంటీ చేయాలని, కూలి రేట్లు పెంచాలని ఉపాధి కూలీలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుని ఉపాధి చట్టానికి నిధులు పెంచడంతోపాటు మరిన్ని సదుపాయాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం చట్టాన్నీ నీరుగార్చడం ద్వారా నిధులను కార్పొరేట్ శక్తుల కోసం మళ్లిస్తోంది.

2014లో బిజెపి తొలిసారిగా అధికారంలోకి రాగానే సంస్కరణలు మొదలయ్యాయి. 2019 ఎన్నికల తరువాత మరింత బరితెగించి నిధుల్లో కోత విధించింది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎన్ఐసి అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోంది. శ్రమదోపిడీకి పాల్పడుతోంది. జిల్లాలోని కూలీలంతా గతంలో ఒక్కపూటే పనిచేసేవారు. గత ఏడాది నుంచి రెండు పూటలా పనిచేయాలనే నిబంధన విధించారు. అందుకు తగ్గట్టు కూలిరేట్లు పెంచలేదు. వేసవి అలవెన్సులు, పనిముట్లకు చెల్లించే అద్దె వంటి వాటిని పూర్తిగా ప్రభుత్వం రద్దుచేసింది. ఇలా నిబంధనలు కఠినతరం చేయడంతో శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పని ప్రదేశంలో నీరు, నీడ సదుపాయాలు కల్పిచేందుకు ఉన్న అవకాశాలను తొలగించడంతో కూలీలు సేద తీరేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిద్ధమయ్యారు.

ఇవీ డిమాండ్లు

- కొత్త సాఫ్ట్‌వేర్‌ను రద్దుచేసి, ఒక్కపూటే పనిపెట్టాలి.
- ఏడాదికి 200 రోజులు పని గ్యారెంటీ చేసి, రూ.600చొప్పన వేతనం ఇవ్వాలి.
- నీరు, నీడ సదుపాయం కల్పించాలి.
- వేసవి అలవెన్సులు, పనిముట్లకు అద్దె వంటివి పునరుద్ధరించాలి.
- పే స్లిప్పులు ఇవ్వాలి.
- మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి.
- మేట్లకు అదనపు ప్రోత్సాహం, ఫోన్ సదుపాయం కల్పించాలి.
- చనిపోయినవారికి రూ.10 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- బడ్జెట్‌లో రూ.2.40 లక్షల కోట్ల నిధులు కేటాయించాలి.



నిరసనలో పాల్గొన్న తూర్పుకాపు సంఘం నాయకులు

ఎస్ఐ తీరుపై నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాధ్యత గల పోలీస్ అధికారి సామాజిక తరగతులను కించపరిచేలా మాట్లాడటం ఎంతవరకు సబబని తూర్పు కాపు సామాజిక తరగతి నాయకులు ప్రశ్నించారు. తూర్పుకాపు సామాజిక తరగతిని కించపరిచేలా వ్యవహరించిన డిటిసి ఎస్ఐను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆ సామాజిక తరగతి నాయకులు రాజకీయాలకు అతీతంగా ఆదివారం విజయనగరంలో నిరసన చేపట్టారు. ముందుగా కలెక్టరేట్ సమీపంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సంగంరెడ్డి బంగారు నాయుడు, నడిపేన శ్రీనివాసరావు, పాలవలస యశస్వి, రొంగలి రామారావు తదితరులు మాట్లాడుతూ ఒక కేసు విషయంలో సంబంధం లేకపోయినా డిటిసి ఎస్ఐ ప్రకాశ్‌కాపు దుర్భాషలు ఆడటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధ్యత గల ఉద్యోగి అయి ఉండి, బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికే ఎస్‌పి దీపికా పాటిల్ డిఎస్‌పి స్థాయి అధికారితో విచారణకు ఆదేశించారని, స్పష్టమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో సదరు ఎస్ఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం నాయకులు, యువత పాల్గొన్నారు.

మహిళల సొమ్ముతో మార్టులా..?

- మహిళా మార్టులకు ఎస్‌హెచ్‌జిల నుంచి కార్పస్ ఫండ్ వసూలు
- ప్రభుత్వ తీరుపై డ్వాక్రా మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి-బొబ్బిలి

'డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించేలా చూస్తా'మని ఊకదంపుడు ప్రకటనలు, ప్రసంగాలు చేస్తున్న పాలకులు ఆచరణలో అమలు చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా మార్టులు ఏర్పాటు చేసి మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తామని చెపుతున్న ప్రభుత్వం నిధులు కేటాయించకుండా డ్వాక్రా మహిళల నుంచి కార్పస్ ఫండ్ పేరుతో డబ్బులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే డ్వాక్రా మహిళల నుంచి కార్పస్ ఫండ్ వసూలు చేసేందుకు వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క డ్వాక్రా మహిళ నుంచి రూ.310 కార్పస్ ఫండ్ వసూలు చేసేందుకు నిర్ణయించారు.

జిల్లా వ్యాప్తంగా రూ.16.77 కోట్లు వసూళ్లకు ప్రణాళిక

జిల్లాలో మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు 48,431 డ్వాక్రా గ్రూపుల్లో 5,41,151 మంది డ్వాక్రా మహిళల నుంచి రూ.16కోట్ల 77లక్షల 56వేల 810 వసూలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో 27 మండలాల్లో 40,307 డ్వాక్రా గ్రూపులలో 4,55,308 మంది ఉండగా వీరి నుంచి రూ.14.11 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారు. విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల మున్సిపాలిటీల్లో 8128 డ్వాక్రా గ్రూపులలో 85,843 మంది సభ్యుల నుంచి రూ.2.66 కోట్లు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో 50 శాతం డ్వాక్రా మహిళల నుంచి కార్పస్ ఫండ్ వసూలు చేసినట్లు సమాచారం.



బొబ్బిలిలో మహిళా మార్టు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసిన అన్నా క్యాంటీన్

పట్టణాలు, ముఖ్య మండలాల్లో మహిళా మార్టులు

జిల్లాలో విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీలతో పాటు ముఖ్య మండలాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కిరాణా వ్యాపారం బాగా జరిగిన చోట మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. కిరాణా వ్యాపారం జరిగే అవకాశం లేని దత్తిరాజేరు, మెంటాడ, మెరకముడిదాం వంటి మండలాల్లో కోళ్లఫారాలు ఏర్పాటు చేసి కోళ్లు పెంచేందుకు, కొన్ని చోట్ల డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసి పాల ఉత్పత్తి చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. మహిళా మార్టులు, కోళ్ల ఫారాలు, డెయిరీ ఫారాల నిర్వహణ వల్ల వచ్చే ఆదాయంతో షాపుల అద్దెలు, పని చేసే డ్వాక్రా మహిళలకు వేతనాలు ఇవ్వనున్నారు.

డ్వాక్రా మహిళల నుంచి ప్రతిఘటన

మహిళా మార్టులు, కోళ్ల ఫారాలు, డెయిరీ ఫారాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా డ్వాక్రా మహిళల నుంచి వసూలు చేయడం ఎంత వరకు సబబని పలువురు మహిళలు ప్రశ్నిస్తున్నారు. కార్పస్ ఫండ్ వసూలు చేసేందుకు డ్వాక్రా మహిళల వద్దకు వెళ్తున్న మెప్మా, వైకెపి సిబ్బందికి మహిళల నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది. దీంతో ఏమి చేయాలో తెలియక వైకెపి, మెప్మా సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

లాభాలు వస్తే వడ్డీ చెల్లింపు

మహిళా మార్టులు, కోళ్ల ఫారాలు, డెయిరీ ఫారాలు ఏర్పాటు కోసం పెట్టుబడికి కార్పస్ ఫండ్ ఇస్తున్న మహిళలకు వడ్డీ చెల్లిస్తామని అధికారులు చెపుతున్నారు. లాభాలు వస్తే వడ్డీ చెల్లించి కార్పస్ ఫండ్ కూడా మహిళలకు చెల్లిస్తామంటున్నారు. లాభాలు వస్తే వడ్డీ చెల్లించే అధికారులు నష్టాలు వస్తే ఏమి ఇస్తారని, పెట్టుబడి నష్టాన్ని ఎవరు భరిస్తారని అధికారులు, ప్రభుత్వాన్ని డ్వాక్రా మహిళలు ప్రశ్నిస్తున్నారు.

బొబ్బిలిలో అన్న క్యాంటీన్‌లో మహిళా మార్టు

బొబ్బిలి మున్సిపాలిటీలో అన్న క్యాంటీన్ భవనంలో మహిళా మార్టు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు ఉన్న చోట, లేకుంటే అద్దె భవనాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేయనున్నారు.

ప్రచారం కోసమే అశోక్ ఛీప్ ట్రిక్స్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రచారం కోసమే టిడిపి నాయకుడు అశోక్ గజపతిరాజు ఛీప్ ట్రిక్స్ ఉపయోగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. పూలే విగ్రహం వద్ద కావాలని తాము తాళం వేసినట్లు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విగ్రహానికి పూలమాల వేసేందుకు అశోక్ తదితరులు వెళ్తూ.. మార్గం మధ్యలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి దండ వేసేందుకు ఆగారని, అక్కడ ప్రహరీకి తాళం వేసి ఉండటంతో గేటుకు దండ తగిలించి ఆయన వెళ్లిపోయినట్లు తాను పత్రికల్లో చదివానని తెలిపారు. ఈ విషయాన్ని కేవలం రాద్ధాంతం చేయాలన్న ఉద్దేశంతోనే తామేదో కావాలని మహనీయుల విగ్రహాలకు దండ కూడా వెయ్యనీయకుండా అడ్డుకుంటున్నట్లు దుష్ప్రచారానికి తెగబడ్డారని అన్నారు. అశోక్ నైజం ఏమిటో అందరికీ తెలుసునని ఎద్దేవాచేశారు. పూలే విగ్రహానికి దండ వేయాలని అనుకున్నప్పుడు కనీసం ముందు రోజైనా అధికారులకు సమాచారం ఇస్తే వారే తాళం తీయించి ఉంచేవారని చెప్పారు. ఇటీవల ఆ విగ్రహం ఆధునికీకరణ చేపట్టి, వాటర్ ఫౌంటైన్ వంటివి ఏర్పాటు చేసి, స్వీయ చిత్రాలు తీసుకునేందుకు వీలుగా నిర్దిష్ట సమయాల్లో తెరిచి ఉంచుతున్నామని వివరించారు. ఈ విషయాన్ని రాజకీయంగా వాడుకోవాలని అనుకోవడం సిగ్గుచేటన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు జెసి రాజు

'చదవడం మాకిష్టం'

బొబ్బిలిరూరల్ : చదవటం మాకిష్టం వేసవి క్యాంపేన్‌లో భాగంగా ఆదివారం నారాయణప్పవలసలో ప్రధానోపాధ్యాయులు జెసి రాజు విద్యార్థులకు భోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో విద్యా కృత్యాలను ప్రతి రోజు చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న కృత్యాలను ప్రతిరోజు చదివి నోట్ బుక్‌లో రాయాలని సూచించారు. చదవటం మాకిష్టం కార్యక్రమం పెట్టి 21వ రోజులు పూర్తి కావడంతో విద్యార్థుల ప్రగతిని వారి ఇండ్లకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి తండ్రులతో మాట్లాడారు. తెలుగు, ఇంగ్లీష్, కథలను గణిత సమస్యలను, విద్యార్థులు వేసిన చిత్ర లేఖనాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తెలుగు ఇంగ్లీష్ కథలను అర్థవంతంగా చదివి వాటిని స్వంతంగా రాయాలని సూచించారు. వేసవి సెలవులను వృథా చేయకుండా చదవటం మాకిష్టం కృత్యాలు చేయటం ద్వారా విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలియ చేశారు.

నగదు పురస్కారానికి విద్యార్థిని ఎంపిక



వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆర్ అనూష 968 మార్కులు సాధించి నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె నియోజకవర్గ స్థాయి నగదు పురస్కారానికి ఎంపికైనట్లు వసతి గృహం ప్రిన్సిపల్ యు. ఉషారాణి తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి, పిఎసిఎస్ అధ్యక్షులు

బూరాడపేటలో చలివేంద్రం

నెల్లిమర్ల : మండలంలోని చిన బూరాడ పేటలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు ప్రారంభించారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ కీర్తి శేషులు నడిపిల్లి రామునాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు, భార్గవిలత డెవలపర్స్ ఎమ్‌డి కోట్ల పైడి నాయుడు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జెడ్‌పిటిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ వేసవి దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి వడ దెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బురాడ పేట ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాథం, వైసిపి నాయకులు బెల్లాన రామారావు, చంద్రం పేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, నాయకులు మక్కువ వెంకట రమణ, కోట్ల సామాలప్పడు, కోట్ల సత్యారావు, కోట్ల కృష్ణ, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

వేపాడ : మండలంలోని డిఆర్ పేట గ్రామానికి చెందిన కందిపిల్లి అబద్ధం దంపతులకు వివాహం చేసుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు మానవతా దృక్పథంతో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు రూ. పదివేలు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం ఆయనే దగ్గరుండి వారికి వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి నాగరాజు, టి. కృష్ణ, గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, సూర్యం పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేంద్రనాయుడు

పండగ శాంతియుతంగా జరుపుకోవాలి

రామభద్రపురం: గ్రామ దేవత పండుగను ప్రజలంతా ఐక్యంగా ఉండి శాంతియుతంగా జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ సురేంద్రనాయుడు కోరారు. మండలంలోని కోటశిర్లాం గ్రామ పెద్దలతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. సోమవారం నుండి బుధవారం వరకు జరగనున్న గ్రామ దేవత పండుగను ప్రజలందరూ ఐక్యంగా ఉండి జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని బందోబస్తు తాము నిర్వహిస్తామని, ప్రజల సహకారం కూడా అవసరమని కోరారు. గ్రామంలో ఉన్న పెద్దలంతా పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండి, యువతకు మార్గదర్శకం కావాలని, వార్డు మెంబర్లు, వాలంటీర్లు సమన్వయంతో పండగను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడ్డి శ్రీనివాసరావు, రౌతు తౌడు, మీసాల రామారావు, ఉప సర్పంచ్ బెవర సత్యం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డివిఎస్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 7వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒసి, బిసి విద్యార్థులు రూ. 200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

145 మందికి కంటి పరీక్షలు

శృంగవరపుకోట : విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్, విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శ్రీవెంకటేశ్వర మెడికల్స్ ఆధ్వర్యంలో ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 145 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైన 55 మందికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో చికిత్సలు ఉచితంగా తిరిగి స్వగ్రామాలకు వారిని పంపిస్తామని సిబ్బంది వెల్లడించారు.

విఆర్ఒ, ఎంపిటిసిల మధ్య మాటల యుద్ధం

రామభద్రపురం: గ్రామ సచివాలయంలో అధికార యంత్రాంగం సాక్షిగా రొంపల్లి టిడిపి ఎంపిటిసి బవిరెడ్డి శంకర్రావుపై ఇదే గ్రామ నివాసి, స్థానిక విఆర్ఒ పువ్వల శ్రీనివాసరావు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ, దూషణలకు దిగారు. గ్రామంలో చేపట్టిన సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో జరిగిన సమీక్షలో వీరిద్దరి ఆరోపణలు తారాస్థాయికి చేరుకొని గొడవ పడే వాతావరణం ఏర్పడింది. ఇద్దరు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాల సానుభూతి పరులు శాంతింప జేశారు. తదుపరి ఇరు వర్గాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో మౌఖిక ఫిర్యాదులు చేసుకున్నారు. అయితే దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని శాంతి భద్రతలు దృష్ట్యా ఆ గ్రామ సచివాలయం మహిళా పోలీస్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాట్లు చేశామని ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఇదిలా ఉండగా విఆర్ఒ గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎంపిటిసి ఆరోపించారు. అలాగే సొంత గ్రామానికి చెందిన చెందిన వ్యక్తి విఆర్ఒగా ఎలా నియాకమయ్యారని ప్రశ్నించారు.

కలెక్టర్ మారితే పనులు చేయరా?

- ప్రతిపాదనలకే పరిమితమైన పాఠశాలల అభివృద్ధి
- సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- సెలవుల్లోనే పనులు చేయాలని పిల్లల డిమాండ్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం, ఆదర్శపాఠశాల ఆవరణమంతా తుప్పలు, డొంకలతో దర్శనమిస్తుంది. ఎప్పటికప్పుడు విషసర్పాలు, క్రిమికీటకాలు దర్శనమివ్వడంతో ఆ పాఠశాలలో చదువుతుంటే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఆటస్థలమూ సరిగా లేదు. ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని విద్యార్థులు, సిబ్బందితో ఆందోళన నెలకొంటుంది. ఈ నేపథ్యంలో ఓ సామాజిక కార్యకర్త సమస్యపై స్పందనలో అప్పటి కలెక్టర్ సూర్యకుమారికి వినతి అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, పనులు మాత్రం ప్రతిపాదనల దగ్గరే ఆగిపోయాయి. కొత్త కలెక్టర్ వచ్చినా ఆ పనులు మాత్రం ముందుకు కదలకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు భయపడుతున్నారు. వేసవి సెలవుల సమయంలోనే అభివృద్ధి చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


బక్కునాయుడుపేట వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం, ఎపి ఆదర్శ పాఠశాల ఉన్నాయి. గురుకులంలో 680 మంది, ఆదర్శ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థిని విద్యార్థులకు కావాల్సినంత ఆట స్థలం ఉంది. కానీ ఆటలు ఆడుకొనేందుకు వీలుకాదు. ఆవరణమంతా దట్టమైన ముళ్లపొదలు, ఆట స్థలమంతా రాళ్ల కంకరతో నిండి ఉంది. ఆటలు ఆడే సమయంలో ఏమాత్రం కాలుజారినా గాయాలపాలయ్యే అవకాశముంది. ముళ్లపొదలు, దట్టమైన డొంకలు పెరగడంతో విషసర్పాలు, కీటకాలు నిత్యం సంచరిస్తుంటాయి. విద్యార్థులకు ప్రాణహాని కలిగే అవకాశముంది. కురుపాంలో వసతిగృహంలో పాముకాటు ఘటనను నేటికీ మరిచిపోలేం. పిచ్చిమొక్కలు తొలగించి, మైదానాన్ని చదును చేయించాలని విద్యార్థులు, అక్కడి సిబ్బంది అనేకమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. అయినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామంటున్న సర్కారు ఆ దిశగా ఈ విద్యాలయాల్లో తీసుకున్న చర్యలు మాత్రం లేవు.



పిచ్చి మొక్కలతో నిండి ఉన్న గురుకుల పాఠశాల భవనం

కలెక్టర్ మారితే పనులు చేయరా.?

ఈ పాఠశాలల్లో ఉన్న డొంకలను తొలగించాలని గత కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్స్ వెంటనే వాటికోసం అయ్యే ఖర్చుకు సంబంధించిన ప్రతిపాదనలూ సిద్ధం చేశారు. కానీ పనులు మాత్రం కార్య రూపం దాల్చలేదు. గతేడాది డిసెంబరు 5న పాఠశాల అభివృద్ధికి రూ. 6.67లక్షలు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు కాలేదు. దీంతో పనులు ముందుకు కదల్లేదు. వాస్తవానికి ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కాబట్టి ఇటువంటి సమయంలోనే పిచ్చి మొక్కలను తొలగిస్తే వాటిలో ఉండే విష సర్పాలు బయటకు పోయే అవకాశం ఉంది. అదే పాఠశాలలు ప్రారంభించిన తరువాత పనులు చేపడితే ఆ సర్పాలు గదుల్లోకి వెళితే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ నాగలక్ష్మి ఈ సమస్యపై దృష్టి సారించి పాఠశాలలు ప్రారంభానికి ముందే అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



పాఠశాల అభివృద్ధి కోసం సిద్ధం చేసిన ప్రతిపాదన పత్రం

చంద్రబాబు వైఖరి దారుణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇళ్ళ స్థలాల విషయంలో చంద్రబాబు నాయుడు వైఖరి దారుణమని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ఎస్.కోటలో పర్యటించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాలు స్థలంలో శవాన్ని పూడ్చిపెడ్డానికి కూడా చాలదు అని అతి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసి అతని భయంకరమైన మనస్తత్వాన్ని మరోసారి బయట పెట్టారన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఆయన ప్రభుత్వంలో ఇవ్వలేక పోయారని, ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి పేదలకు ఇళ్ళ పట్టాలు ఇస్తే చూసి తట్టుకోలేక చేసిన వ్యాఖ్యలు పేదల పట్ల చంద్ర బాబు నాయుడుకి ఉన్న చులకన భావాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించాయన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ప్రజా సంక్షేమాన్ని, ఇచ్చిన వాగ్దానాలని, పేద ప్రజల సొంతింటి కలని పూర్తిగా గాలికి వదిలేసారన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ ప్రజల ప్రభుత్వం, ప్రజా సంక్షేమ ప్రభుత్వం అంటే ఇలా ఉండాలి అనే రీతిలో పరిపాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టిడిపి హయాంలో లాగా జన్మభూమి కమిటీలు పెట్టి వాళ్లకు భజన చేసిన వాళ్ళకి వాళ్ల స్వార్థం కోసం పని చేసే వాళ్లకు మాత్రమే లబ్ధిని చేకూర్చలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేల చంద్రబాబుకు ప్రజలు కష్టాలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. రాబోయే 2024 ఎన్నికలలో టిడిపికి మరోసారి ఓటమి తప్పదని ప్రజల ఆశీస్సులతో జగన్మోహన్ రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం కూడా తథ్యమని జోష్యం పలికారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ఇన్‌ఛార్జి తీరుతో పార్టీలో గ్రూపులు

ప్రజాశక్తి - వేపాడ

టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి తీరుతో గ్రామ స్థాయిలో పార్టీలో గ్రూపులు వస్తున్నాయని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పనిచేసి నియోజకవర్గంలో టిడిపి విజయానికి కృషి చేయాలని చంద్రబాబు ఇటీవల సమావేశంలో చెప్పిన మాట వాస్తవమేనన్నారు. కానీ కొన్ని పత్రికలు వాట్సాప్ గ్రూపుల్లో మాత్రం ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి చెప్పిన విధంగానే అందరూ పనిచేయాలని ఆయన ఆదేశించినట్లు ప్రచారం జరగడం దారుణమన్నారు. ఆయన అలా చెప్పలేదని అందరినీ కలిసి కట్టుగా పనిచేయమన్నారని వివరించారు. కానీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. తన స్వగ్రామంలో తనను ఓడించడానికి మరో గ్రూపును ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఆమె చెప్పిన దానికల్లా తల ఆడించకపోతే వారికి వ్యతిరేకంగా అదే గ్రామంలో మరో గ్రూపును ప్రోత్సహించి తగాదాలకు కారణమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె విధానం వల్లనే మండలంలో టిడిపి రెండు ముక్కలుగా విడిపోయిందని విమర్శించారు. తాను మరలా గెలిచిన తరువాత గొంప కృష్ణ వెంట ఉన్న వారి సంగతి చూస్తానని ఆమె నేరుగా ప్రచారం చేయించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు.



గొంప వెంకటరావు

జనసేనతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షులు పతివాడ అచ్చుంనాయుడు అన్నారు. ఆదివారం బొప్పడాంలో పల్లెపల్లెకు జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనను ఆదరించి ఎన్నికల్లో గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సమస్యలు పరిష్కారమవుతా యన్నారు. 2019 నుంచి జనసేన ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందని దీనిలో భాగంగా భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం, కరోనా సమయంలో ఆక్సిజన్ పంపిణీ, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, జగనన్న ఇళ్ల స్థలాలు మోసం, ఉద్దానం కిడ్నీ వ్యాధి బాధితుల పక్షాన పోరాటం తదితర అంశాలపై జన సేన నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ఆత్మ హత్యలు చేసుకున్న కౌలు రైతులకు తన సొంత డబ్బు రూ. 30కోట్లు ఖర్చుపెట్టిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కుతుందన్నారు. ఎటువంటి అధికారం లేకపోయినప్పటికీ పవన్ కళ్యాణ్ పేదలకోసం నిరంతరం సేవ చేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తిని ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన భాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమం లో పూస పాటిరేగ, డెంకాడ మండల అధ్యక్షులు జలపారి శివ, పతివాడ కృష్ణవేణి, నియోజకవర్గం సీనియర్ నాయకులు కొత్తూరు లక్ష్మణ, రేవల్ల రమణ, వజ్రపు బద్రి, దుర్గాసి శేఖర్, త్రినాథ్, వేణు, రమణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు పతివాడ అచ్చుంనాయుడు

రూ. 230 కోట్లతో నాడు - నేడు పనులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

జిల్లా వ్యాప్తంగా ఉన్న 737 ప్రభుత్వ పాఠశాలలో నాడు - నేడు పథకం ద్వారా రూ. 230 కోట్లతో అభివృధి పనులు జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి బి. లింగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్లో మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 84 అంగనవాడి కేంద్రాలు, 17 ప్రభుత్వ జూనియర్ కళాశాల కలుపుకొని 737 ప్రభుత్వ పాఠశాలలో నాడు - నేడు పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1803 ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న లక్ష 45 వేల 883 విద్యార్థులకు నోట్ పుస్తకాలు, డిక్షనరీలు పూర్తిస్థాయితో పాటు 80 శాతం యూనిఫామ్‌లు, 60 శాతం పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ కూర్మారావు, లైబ్రేరియన్ దామోదర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ

పలు చోట్ల రాజీవ్ గాంధీ వర్ధంతి


ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాలులర్పించారు. ఆయన భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్, పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు, యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, బాడంగి మండల అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక గాంధీ పార్క్ ఆవరణంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడి బంగారు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బంగారునాయుడు, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పూడి శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయ కర్త నానాజీ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: నగరంలోని ఎత్తు బ్రిడ్జి కూడలిలో రాజీవ్ గాంధీ విగ్రహానికి జిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సతీష్‌కుమార్, సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు షరీఫ్, పార్టీ మండల అధ్యక్షులు టి. సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





బొబ్బిలి, ఎస్‌కోటలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్ర స్వామి

సమాజ సేవంటే ఇష్టం : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన వృత్తి రాజకీయాలే అయినా, సమాజ సేవ అంటేనే ఇష్టమని, అందుకే మొదటి నుంచీ ప్రజా సేవకే అంకితమయ్యానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఆరోగ్య గాయత్రి ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక రాజీవ్ నగర్ కాలనీ వద్దనున్న గాయత్రి భవన్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవారికి సాయం చేసే మంచి గుణం బ్రాహ్మణులకు ఎప్పుడూ ఉంటుందన్నారు. కొన్ని రుగ్మతల విషయంలో ఆరోగ్యశ్రీకి అవకాశం ఉండదని, అటువంటి కేసుల విషయంలో సిఎం సహాయ నిధి వచ్చేలా తనవంతుగా తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బ్రాహ్మణ సమాఖ్య నిర్వహిస్తున్న ఆరోగ్య గాయత్రి ఉచిత వైద్యశాలకు ఆర్థిక తోడ్పాటు కోసం రూ.10 వేల విరాళాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు బాబూజీ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ శ్రీకాంత్, రమణమూర్తి, వెంకటరావు, అచ్యుతరామయ్య, రాంజీ, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

కత్తితో వ్యక్తిపై దాడి..

ఆర్థిక లావాదేవీలే కారణం

రేగిడి: మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ అనుబంధం ఇథనాలు కర్మాగారంలో సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై పాలకొండకు చెందిన తిరుమల కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్ జమ్ము లక్ష్మీనారాయణ ఆదివారం కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమణ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ పనిచేస్తున్న కార్మికులు అతన్ని హుటాహుటిన రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ కర్మాగారంలో తిరుమల కనస్ట్రక్షన్ తరుపున లక్ష్మీనారాయణ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. సంకిలికి చెందిన రమణ ఇదే కనస్ట్రక్షన్‌కు ఇంటి నిర్మాణ మెటీరియల్‌ను అందించేవాడు. ఈ నేపథ్యంలో సూపర్ వైజర్‌గా ఉన్న లక్ష్మీనారాయణకు, రమణకు మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయి. అయితే గత కొంత కాలంగా డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కర్మాగారంలో మరోసారి గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో లక్ష్మీనారాయణ కత్తితో రమణ మెడపై దాడి చేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తన సిబ్బందితో ఆసుపత్రికి వెళ్లి బాధితుడు రమణ వద్ద వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాయపడిన రమణ

నేరాలు ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బొబ్బిలి: సిపిఎం, మీడియా చొరవతో బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బొబ్బిలి పట్టణానికి చెందిన రెడ్డి శ్రీను హెర్బర్ట్ డాక్టర్ సందులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యాన్ని ఎం.బూర్జవలస బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్నారు. మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు మీడియాకు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలంకు తెలియడంతో నిఘా పెట్టి పాత చక్కెర పరిశ్రమ వద్ద అక్రమ మద్యాన్ని పట్టుకుని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడకు చేరుకుని అక్రమంగా తరలిస్తున్న 107 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తరలింపు, బెల్ట్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం డిమాండ్ చేశారు.

ఇద్దరు అరెస్టు

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామ సమీపంలో ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తున్న జామి కృష్ణ, జామి బంగారి నాయుడు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులను బాడంగి ఎస్ఐ జయంతి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ నిమిత్తం వారిద్దరినీ రిమాండ్ నిమిత్తం బొబ్బిలి ఎజెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించారు.

కేసు ఛేదిస్తాం : సిఐ

లక్కవరపుకోట: మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన గ్రామ సమైక్య సంఘం బుక్ కీపర్ గోకాడ మహేశ్వరి అనుమానాస్పద మృతి కేసును త్వరలోనే ఛేధిస్తామని ఎస్‌కోట సిఐ ఎస్ సింహాద్రి నాయుడు అన్నారు. మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ నుండి గేదెలవాని పాలెం వెళ్లే రహదారిలో గల చిలక వానిపాలెం చెరువు వద్ద తుప్పల్లో మహేశ్వరి ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి పాఠ కులకు విధితమే. ఈ కేసు విచారణలో భాగంగా ఆదివారం సిఐ, ఎస్ఐలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిఐ ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించి కొందరిని విచారించామన్నారు. త్వరలోనే నిందుతులను పట్టుకుంటామని పోలీసులు నుంచి ఎవరూ తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.